TGTEL/25/A0827

# ప్రజా దివాన్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 202 | బుధవారం 15-07-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

# ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి..

## ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు

- రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

న్యూఢిల్లీ,జూలై14: రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్ధరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్



## బోర్డు పరీక్షలపై

### సీబీఎస్ఈ కీలక నిర్ణయం

- సీబీఎస్ఈ మూడో భాషపై కొత్త నిబంధనలు
- 9, 10 తరగతుల్లో మూడో భాషకు పరీక్షలు లేవు
- ఇంటర్నల్ అసెస్‌మెంట్ మాత్రమే ఉంటుంది
- 3 భాషలు చదవడం తప్పనిసరి
- వాటిలో 2 భారతీయ భాషలు ఉండాలి
- మూడో భాషగా విదేశీ భాష ఎంపికకు అవకాశం
- ఫెయిల్ అయితే రీ-అసెస్‌మెంట్ అవకాశం
- ప్రస్తుత 10వ తరగతికి పాత విధానమే
- 2027-28 బ్యాచ్ నుంచి అమలు
- ఆర్-3 మెటీరియల్ ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది.

దిల్లీ: బోర్డు పరీక్షలపై సీబీఎస్ఈ కీలక నిర్ణయం తీసుకుంది. మూడో భాషపై స్పష్టమైన విధివిధానాలు జారీ చేసింది. ఇకపై 9, 10 తరగతులకు మూడో భాష పరీక్షకు ఇంటర్నల్ అసెస్‌మెంటే ఉంటుందని, ఈ సబ్జెక్ట్‌కు పరీక్షలు ఉండబోవని తెలిపింది. 2026-27లో 9వ తరగతిలో చేరే విద్యార్థులు 3 భాషలు చదవాలని, వాటిలో 2 భారతీయ భాషలు ఉండాలని నిబంధన విధించింది. మూడో భాష.. విదేశీ భాష ఎంచుకునేందుకు వీలు కల్పించింది.

ఒక వేళ పది ఇంటర్నల్‌లో తప్పితే.. ఫైనల్ ఫలితాల కంటే ముందే మరోసారి రీ అసెస్‌మెంట్ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. 8వ తరగతిలోని 3 భాషలే తొమ్మిదో తరగతిలోనూ కొనసాగుతాయని తెలిపింది. అయితే, ప్రస్తుత పదో తరగతి విద్యార్థులకు మాత్రం.. పాత విధానమే అమల్లో ఉంటుందని, మూడో భాష నిబంధన వర్తించదని బోర్డు స్పష్టం చేసింది. కొత్త నిబంధనలు 2027-28 పదోతరగతి బ్యాచ్ నుంచి అమలు చేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో ఆర్3 మెటీరియల్‌ను అందుబాటులో ఉంచి

## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో

## విమానాశ్రయాల నిర్మాణం

- ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం
- ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణచేపడతాం



వివరాలు 2 లో..

## బిజినెస్ రూల్స్‌లో

## కీలక సంస్కరణలు




2లో

- క్రౌడ్ సోర్సింగ్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి ఆగొద్దు
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి
- మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

## ముంబయిలో పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన

## మంత్రి కందుల దుర్గేష్

- పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి
- త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పేజి 2లో ▶



## రాయలసీమ అభివృద్ధిపై

## చర్చకు సిద్ధమా



2లో

- వైసీపీ ఐదేళ్ల పాలనలో ఖర్చుచేసింది రూ.2 వేల కోట్లే
- కూటమి ప్రభుత్వ హయాంలో రూ.25 వేల కోట్లతో పనులు
- రాయలసీమ ఎత్తిపోతలపై 2020లో ఎన్జీటీ స్టే
- నిధులు కేటాయించకుండా నెల్లూరులో రౌండ్ టేబుల్ డ్రామాలు
- ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం దురదృష్టకరం

## నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా

## రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాలు

- ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్లతో ఉప కేంద్రం నిర్మాణం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిధులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పేజి 2లో ▶



## ఒంటిమిట్టలో మూలవరుల బంగారు కవచాల తయారీకి తితిదే బోర్డు ఆమోదం



తిరుమల: తితిదేలోని వివిధ ట్రస్ట్‌లు, స్కీమ్‌లకు విరాళాలు అందించే దాతలకు కల్పిస్తున్న ప్రివిలేజెస్‌లో పలు మార్పులు చేస్తున్నట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో పాలకమండలి సమావేశం ముగిసిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విరాళాల నిర్వహణలో విరాళాల నిర్వహణలో మరింత పారదర్శకత, ఏకరీతి (యూనిఫార్మిటీ) తీసుకురావడానికి తితిదేకు చెందిన అన్ని ట్రస్ట్‌లు, పథకాల దాతలకు కల్పించే ప్రివిలేజెస్‌లో మార్పులు చేపట్టామన్నారు. ఈ కొత్త నిబంధనలు మంగళవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. ఎజి 2లో ▶

# సంపాదకీయం

## ‘సర్’.. ఏ అసమర్థతలకు చిహ్నం?

మనం జ్ఞానం పొందటంలో ప్రత్యక్ష అనుభవానికి మించింది మరొకటి ఉండదు. అన్ని విషయాల్లో ఇది సాధ్యం కాకపోయినా రాజకీయాల్లో ప్రత్యక్ష అనుభవానికి ఉన్న పాత్ర చాలా ఎక్కువ. ఓటర్ల జాబితాను సమూలంగా ప్రక్షాళించటానికి ఉద్దేశించిన (సర్) ప్రక్రియ జరుగుతున్న తీరుతెన్నులను చూస్తుంటే ప్రజల ప్రత్యక్ష అనుభవం చెబుతున్న పాఠాలు చాలా కఠోరంగా ఉంటున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఇంకో రెండేళ్ల తర్వాతే జరుగుతాయి. బిహార్, బెంగాల్, తమిళనాడులో లాగా ఎన్నికల ముందు హడావుడిగా ఇక్కడ సర్ చేపట్టలేదు. అంతవరకూ కాస్త ఉపశమనమే. కానీ తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్న దాన్ని, ఓటర్లలో నెలకొన్న అనేక సందేహాలను, వాళ్లు స్వయంగా సేకరించాల్సిన సమాచారాన్ని, వెలికితీయాల్సిన పత్రాలను దృష్టిలో పెట్టుకుంటే.. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆ మూడు రాష్ట్రాల్లో ఏం జరిగిందో, దానికి మూల్యం ఎవరు చెల్లించారో అర్థంచేసుకోవటం కష్టం కాదు.

సర్ నిబంధనల ప్రకారం బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలి. ఇది ప్రాథమిక నియమం. నగరాలు, పట్టణాల్లో అది అమలవుతున్న ప్రాంతాలను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెబుతోంది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు కనపడుతున్నాయి. ఇది అంతవరకే అయిపోలేదు. పూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ ప్రక్రియలో ప్రాథమిక అడుగే సరిగా పడలేదని దీన్నిబట్టి తేలికగానే అర్థం అవుతుంది. అయినా మన యంత్రాంగం సమర్థత బ్రహ్మాండంగా ఉందని మనం సరిపెట్టుకోవాలి. అంతా సజావుగా నడుస్తోందని మనకుమనమే సర్దిచెప్పుకోవాలి. నియమాలు ఘనంగా, అమలు హీనంగా ఉండటం అనేది మన ప్రభుత్వాల సహజ లక్షణంగా భావిస్తేనే అలా చేయగలం. ముఖ్యంగా అట్టడుగు, మధ్యతరగతి వర్గాలకు వచ్చేసరికి ఎన్నో చట్టాలు, నియమాల పరిస్థితి ఇదే తీరులో ఉంటోంది. అందుకే ఏ ప్రక్షాళనలోనైనా నష్టపోయేది ఈ వర్గాలే.

కొత్తగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదుచేయటానికి ఎన్నో పత్రాలు చూడాలి. స్వయంగా బీఎల్ఓ ఆ వ్యక్తి నివసించే ఇంటిని సందర్శించాలి. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదనేది నియమం. ఆ నియమాన్ని కచ్చితంగా పాటించే.. ఓటర్లుగా నమోదుచేశామని చెప్పే ఎలక్షన్ కమిషన్ తాను జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డులనే సర్‌లో ప్రామాణికంగా తీసుకోలేమని సుప్రీంకోర్టుకు స్వయంగా చెప్పింది. అలాగే ఆధార్ కార్డు అందుకు ఉపయోగపడదని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు చివరకు ఎలక్షన్ కమిషన్ వాదననే పరిగణనలోకి తీసుకుంది. ఆధార్ కార్డుని విదేశీవ్యక్తులకు కూడా జారీచేస్తారని, అందుకే అది ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో మన ఇంగితజ్ఞానం చెబుతూనే ఉంటుంది. ఎంతమంది విదేశీయులకు అధికారికంగా ఆధార్ కార్డులు జారీ అయివుంటాయో లెక్కలుతీస్తే వారి సంఖ్య చాలా పరిమితంగానే ఉంటుంది. వాళ్లు అయినా కొన్ని పత్రాలు సమర్పించకుండా కార్డులు పొందలేరు. అతి స్వల్పసంఖ్యలో విదేశీయులు ఆధార్ పొందుతుంటే మొత్తం ఆధార్ కార్డుల ప్రామాణికతనే శంకించటం సామాన్యుల తర్కానికి అందదు. పర్యాటకులుగానో, విద్యార్థులుగానో, ఉద్యోగులుగానో, పరిశోధకులుగానో వచ్చిన విదేశీ వ్యక్తులకు ఆధార్ ఇవ్వాలన్న నిబంధనను అధికారికంగానే పెట్టుకుని ఈ వాదనను చేయటం విడ్డూరంగానూ, వైపరీత్యంగానూ భావించాలి. ఇక ఇతర దేశాల సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవాళ్లు ఆధార్ కార్డులు పొందటం ఎక్కువగానే ఉందని అనుకుందాం. మరి అందుకు కారణం ఎవరు? అని ప్రశ్నించుకుంటే వేళ్లన్నీ అధికారయంత్రాంగం వైపే చూపుతాయి. పోనీ వీళ్లు అయినా కేంద్ర మంత్రులు ప్రచారం చేస్తున్నట్లు కోట్లలో ఉన్నారా? సరిహద్దు రాష్ట్రాలన్నీ అక్రమ వలసదారులతో నిండిపోతున్నాయా? అని పరిశీలిస్తే అలాంటి భయానక దృశ్యం కనపడదు. అసాంలో 2025--26లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను (స్పెషల్ రివిజన్) చేపట్టారు. ఆ సందర్భంగా తొలగించిన ఓట్లు 2,43,485 మాత్రమే. వీళ్లల్లో చనిపోయిన వారితో పాటు రెండుచోట్ల ఓట్లున్న వారి పేర్లూ ఉన్నాయి. పోనీ ఇందులో సందేహాస్పద ఓటర్లు ఎంతమందో అధికారికంగా ప్రకటించనూలేదు. అలా ప్రకటిస్తే కనీసం అక్రమవలసదారుల గురించి ఒక అవగాహన ఏర్పరచుకునే అవకాశం ఉండేది.

సందేహాస్పద ఓటర్లందరినీ మనం అక్రమ వలసదారులుగా భావించలేం. బీఎల్ఓలకు సరైన పత్రాలను అందించలేని వాళ్లనూ ఆ జాబితాలో చేర్చుతారు. ఇంకో విషయాన్ని చూసినా అక్కడి అసలు పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. 1997 నుంచి 2023 వరకూ అసాంలో మొత్తం 2,44,144 మందిని అనుమానాస్పద ఓటర్లుగా భావించి వారి పౌరసత్వాన్ని తేల్చటానికి ఫారెన్ ట్రైబ్యునళ్లకు నివేదించారు. వీళ్లందరూ అక్రమవలసదారులే అనుకున్నా మొత్తం ఓటర్లలో వారు ఒకశాతం మాత్రమే ఉంటారు. కానీ వీళ్లల్లో 51,505 మందిని మాత్రమే విదేశీయులుగా తేల్చారు. మరికొందరిని భారతీయులుగానే పరిగణించారు. కొన్ని కేసులు ఇంకా ట్రైబ్యునళ్లలో నడుస్తున్నాయి. రాజకీయ లబ్ధికోసం చేసే ఆర్భాటప్రకటనలకూ వాస్తవాలకూ మధ్య దూరం మామూలుగా ఉండదని దీన్నిబట్టి స్పష్టం అవుతోంది.

తెలంగాణలో 2002లో చేపట్టిన సర్ తర్వాత ఏడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటువేసిన వారందరూ కూడా ఇప్పుడు మళ్లీ తమని తామే నిఖార్సైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఇంటర్‌నెట్‌ని ఉపయోగించగలిగినవాళ్లు కూడా 2002 నాటి సర్ జాబితాలో తమ పేర్లు వెతుక్కోటానికి కిందామీదా పడుతున్నారు. గంటలపాటు దానికోసం ప్రయత్నించి విఫలమై చివరకు 2002నాటి సర్‌లో తమపేరు లేదనే వెసులుబాటును ఉపయోగించుకుని ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూర్తిచేస్తున్నారు. దీనికి ఫోన్‌నంబరు, ఆధార్ కార్డు వివరాలను సమర్పించి వాటి ఆధారంగా వచ్చే ఓటీపీలతో (వన్ టైం పాస్‌వర్డ్స్) ప్రక్రియను పూర్తిచేస్తున్నారు. 2002 నాటి సర్ జాబితాతో సంబంధం లేకుండానే ఓటర్లుగా కొనసాగే అవకాశం ఉంటే అసలు దాంతో మొత్తం ప్రక్రియను ఎందుకు ముడిపెట్టాల్సి వచ్చిందనే ప్రశ్న తలెత్తకమానదు. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11 రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలి.

2002 నాటి సర్ ఎంతచక్కగా జరిగిందో తెలుసుకోవాలంటే అప్పటి పత్రికల కథనాలు చూస్తేగానీ విషయం అర్థంకాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడు సర్‌కు సంబంధించి ప్రత్యేక హడావుడి కనపడలేదు. మామూలు ఓటర్ల జాబితా సవరణ లాగే అది జరిగిపోయింది. బహుశా అప్పుడు ఎన్నికలు లేకపోవటం కూడా అందుకు కారణమై ఉంటుంది. దీనికి భిన్నంగా ఇటీవల బిహార్, బెంగాల్, తమిళనాడుల్లో తగిన సమయం ఓటర్లకు ఇవ్వకుండా హడావుడిగా సర్ చేపట్టటంతోనే తీవ్రస్థాయిలో వివాదాలు చెలరేగాయి. రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల వ్యూహాలు, ఎత్తుగడలు, ప్రచారాల్లో మునిగిపోయిన సందర్భంలో సర్ చేపట్టటం అనుచితంగానే కనపడుతుంది. ఆ అనుచిత చర్యలే ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను ప్రశ్నించేలా ఆస్కారం కల్పించాయి. అధికార వ్యవస్థలన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం కావాల్సిన రీతిలో ఒరిగిపోతున్న నేపథ్యంలో ఎన్నికల ముందు చేపట్టిన సర్‌పై అనుమానాలు కలగకుండా ఉండవు. ఇప్పుడే బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లలేని పరిస్థితి ఉంటే 2002లో సర్ అంతా సక్రమమని భావించి దాన్ని ప్రామాణికంగా తీసుకోవటం ఏ మాత్రం సహేతుకంగా అనిపించదు. అప్పటికి మొబైల్ ఫోన్లు లేవు. ల్యాండ్‌లైను ఫోను ఉన్న వాళ్లూ తక్కువే. సోషల్ మీడియా లేదు. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఇప్పటి స్థాయిలో విస్తృత ప్రజానిఘా లేని ఆనాటి పరిస్థితిలో 2002 నాటి సర్‌కు చాలా పరిమితులు ఉంటాయి. పేర్లలో, ఇంటిపేర్లలో, వయస్సుల నమోదులో ఎన్నో తప్పులు ఆనాటి జాబితాలో కనపడతాయి. వీటన్నిటినీ సరిదిద్దుకోవాల్సిన బాధ్యతను ఇప్పుడు ఓటర్లపైనే పెట్టారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదుచేయటం రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ విధి. అలా

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్నవరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతోనిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్య పరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం లోమంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగావరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమైఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతరపరిశ్రమలతోవరంగల్కీలకనగరంగాఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండజిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలోఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దంపట్టేలా డిజైన్లు ఉండాలనిభావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయంనిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణసంస్థలు (ఈ÷ుక్ష)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైనప్రతిపాదనలుసమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలోనల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వసలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీకె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీకోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలుఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు.

### ముంబయిలో పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన

# మంత్రి కందుల దుర్గేష్

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్టుదలకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు..

## ఒంటిమిట్టలో మూలవరుల బంగారు కవచాల తయారీకి తితిదే బోర్డు ఆమోదం

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే వివిధ ట్రస్ట్‌లు, పథకాలకు విరాళాలు అందించిన దాతలకు ప్రస్తుతం అమలులో ఉన్న ప్రివిలేజెస్ యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు.

తితిదే బోర్డు సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలు..

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయ మూలవరులకు బంగారు కవచాల తయారీకి తితిదే ట్రెజరీలోని కిలో బంగారం వినియోగించుకునేందుకు ఆమోదం

రూ.6.31 కోట్లతో తిరుమలలో ఎస్ఎస్‌డీ టోకెన్లు కలిగిన భక్తులు వేచి ఉండేందుకు ఆళ్వార్ ట్యాంక్ సమీపంలో శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్లు నిర్మించేందుకు టెండర్లకు ఆమోదం

తిరుమలలోని కుమారధార, పసుపుధార డ్యామ్‌లు మరింత పటిష్ఠంగా ఉండేందుకు డబుల్ లేన్ వంతెన నిర్మాణానికి రూ.2.77 కోట్లు మంజూరుకు ఆమోదం

ఎస్వీ మ్యూజియంలో 12 ఏళ్లు పైబడిన సందర్శకులకు ప్రవేశరుసుం రూ.50గా (+ుాతో కలిపి) నిర్ణయం. మ్యూజియం నిర్వహణ బాధ్యతలను టాటా సంస్థ ద్వారా నిర్వహించేందుకు ఆ సంస్థను కోరాలని నిర్ణయం

భక్తుల భద్రత దృష్ట్యా తిరుమల, తిరుపతిలోని తితిదే ఆలయాలు, విశ్రాంతి భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థల సమగ్ర నిర్వహణ కోసం రూ.2.35 కోట్లతో నిర్వహణ పనులను నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయం.

తిరుమలలోని టీబీసీ, ఏటీసీ విశ్రాంతి భవనాల వద్ద ఉన్న 12 పాత భవనాలను తొలగించి, వాటి స్థానంలో దాతల సహకారంతో నూతన భవనానలు నిర్మించేందుకు నిర్ణయం


2027 ఏడాదికి సంబంధించి శ్రీవారి క్యాలెండర్లు, డైరీలు ముద్రించేందుకు నిర్ణయం. డైరీలు 10 లక్షలు, 12 పేజీల క్యాలెండర్లు 13.50 లక్షలు, 6 పేజీల క్యాలెండర్లు 75 వేలు ముద్రించేందుకు ఆమోదం.

తితిదే క్యాంటీన్ల విభాగంలో ఉన్న 65 సర్వర్ల పోస్టులను క్యాటరింగ్ సూపర్‌వైజర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయం.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా

మొదటిపేజీ తరువాయి

పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ



సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు.

జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు

అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్ రూల్స్‌లో

# కీలక సంస్కరణలు

మొదటిపేజీ తరువాయి



**అమరావతి, జూలై 14 :**

ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వీటి రీ డ్రాఫ్ట్ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) కేంద్రంలో వివిధ శాఖల పౌరసేవలు, యూరియా లభ్యతపై సమీక్షించారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం ఇవ్వాలని, ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**దేవాలయాల సమగ్ర అభివృద్ధి**

రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని, సరైన ప్రణాళికల ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను, పర్యాటక కార్యకలాపాలను పెంచాలన్నారు. దేవాలయాలను ఆనుకుని ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలని స్పష్టం చేశారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాలను పెంచాలని, రైతులకు అవసరమైన యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని ఆదేశించారు.

**భూ వివాదాల పరిష్కారం**

గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూములను 22ఏ కింద పెట్టి వివాదాల్లోకి నెట్టారని చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఇప్పటివరకు 27 లక్షల మందికి పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు. శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించడం ద్వారా రైతుల సమస్యలు తీరడంతో పాటు రూ.900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందని వివరించారు. క్షేత్రస్థాయిలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

**మానవతా దృక్పథం**

పీజీఆర్ఎస్‌తో పాటు వచ్చే ప్రతి ఫిర్యాదును మానవతా కోణంలో వేగంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి సూచించారు. రొటీన్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తేనే ప్రజల్లో సంతృప్తి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ రూపొందించిన ‘గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్’ మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షలో మంత్రి పార్థసారధి వర్చువల్‌గా పాల్గొనగా, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## రాయలసీమ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా

మొదటిపేజీ తరువాయి

**మంగళగిరి, జూలై 14 :**

రాయలసీమ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాజెక్టులపై వైసీపీ రోజుకో డ్రామా ఆడుతోందని మండిపడ్డారు. 2020లోనే రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఎన్జీటీ స్టే విధిస్తే, అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో ఆ స్టేను ఎందుకు వెకేట్ చేయించలేదని ప్రశ్నించారు. సీమకు తీరని ద్రోహం చేసిన వైసీపీ నేతలకు ఆ ప్రాంతం పేరు ఎత్తే అర్హతే లేదని ధ్వజమెత్తారు.

**కూటమి ప్రభుత్వ నిధుల వరద**

వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు ఖర్చు చేసింది కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమేనని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24 నెలల్లోనే సుమారు రూ.25 వేల కోట్లతో పనులు చేపడుతోందని చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులు ఎన్టీఆర్ హయాంలో నిర్మించినవేనని, అవి టీడీపీ బ్రాండ్ అని గుర్తుచేశారు. జగన్ పాలనలో సాగునీటి రంగం పూర్తిగా నిర్వీర్యమైందని, 102 ప్రాజెక్టులను జీవో 365 ద్వారా రద్దు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం హంద్రీనీవా సామర్థ్యాన్ని పెంచి చివరి భూములకు నీరందిస్తోందని వివరించారు.

**రాజకీయ నిరుద్యోగుల సభ**

నెల్లూరులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం కేవలం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం పెట్టుకున్న వైసీపీ రాజకీయ నిరుద్యోగుల సభ మాత్రమేనని చంద్రమోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. కాలువల్లో పూడిక తీయకుండానే దొంగ బిల్లులు చేసుకున్న వ్యక్తి ఆధ్వర్యంలో ఇలాంటి సమావేశాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ నేతలకు నిజంగా ఆత్మవిమర్శ చేసుకోవాలని ఉంటే నెల్లూరులో కాదు, తాడేపల్లి ప్యాలెస్‌లో రౌండ్ టేబుల్ పెట్టుకోవాలని హితవు పలికారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వని చరిత్ర జగన్ ది అని విమర్శించారు.

**ప్రాంతీయ విద్వేషాలు తగవు**

రాయలసీమ, ఉత్తరాంధ్ర పేరుతో ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ ప్రయత్నించడం దురదృష్టకరమని చంద్రమోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నెల్లూరు జిల్లాకు సోమశిల, కండలేరు జలాశయాలను అందించిన ఘనత టీడీపీదేనన్నారు. దేశంలోనే అత్యంత ధనవంతులైన రాజకీయ కుటుంబాల్లో జగన్ కుటుంబం ఒకటని ఆరోపించారు. ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుతో నిత్యం రాజకీయం చేయడం మానుకోవాలని, గత పాలనలో చేసిన పాపాలపై జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలని డిమాండ్ చేశారు.

# కలాన్ని నమ్ముకున్న కుటుంబంలో తీరని విషాదం: బూరుగుపల్లి పాత్రికేయుడి మృతితో దిక్కుతోచని స్థితిలో భార్యాపిల్లలు

**– జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత ఎక్కడ?: మీడియా యాజమాన్యాలు, ప్రభుత్వాల నిర్లక్ష్యంపై వొడ్యాల వేణు ఆందోళన**
**– జర్నలిస్టుల కుటుంబాల రక్షణకు ప్రత్యేక విధానం తీసుకురావాలని డిమాండ్**



బోయినిపల్లి మండలం/ప్రజాదివాస్ జూలై 14
సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజల గొంతుకగా నిలిచే జర్నలిస్టుల జీవిత భద్రత నేడు ప్రశ్నార్థకంగా మారుతోందని సీనియర్ పాత్రికేయుడు వొడ్యాల వేణు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా గుర్తింపు పొందిన జర్నలిస్టులు, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పనిచేసే విలేకరులు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలిచే వ్యవస్థ బలహీనంగా ఉందని ఆయన పేర్కొన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన పాత్రికేయుడు గజ్జెల శ్రీనివాస్ ఆకస్మిక మరణం ఈ పరిస్థితికి నిదర్శనంగా నిలిచిందన్నారు. గత పదేళ్లుగా గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన శ్రీనివాస్ మృతి కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టిందని తెలిపారు.భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో ఉన్న ఆ కుటుంబం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ భవిష్యత్తుపై ఆందోళన చెందుతోందన్నారు. ప్రజల సమస్యల కోసం నిరంతరం శ్రమించిన ఒక జర్నలిస్టు కుటుంబం నేడు సహాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.ఈ ఘటన ఒక్క కుటుంబానికి మాత్రమే పరిమితం కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది జర్నలిస్టుల భవిష్యత్తుకు సంబంధించిన హెచ్చరికగా భావించాలని వొడ్యాల వేణు అన్నారు. జర్నలిస్టులను కేవలం వార్తలు అందించే వ్యక్తులుగా కాకుండా ప్రజా వ్యవస్థలో కీలక భాగస్వాములుగా గుర్తించాలని సూచించారు.ప్రభుత్వాలు, మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టు సంఘాలు కలిసి జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, మరణానంతర కుటుంబ సహాయ పథకాలు వంటి సంక్షేమ చర్యలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే వృత్తిపరమైన భేదాలను పక్కనపెట్టి జర్నలిస్టులు ఆపదలో ఉన్న తోటి సహచరులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజల కోసం కలం పట్టే చేతులకు భరోసా లేకపోతే, భవిష్యత్తులో ప్రజల గొంతుకను వినిపించే స్వరాలు నిశ్శబ్దమయ్యే ప్రమాదం ఉందని వొడ్యాల వేణు ఆవేదన వ్యక్తం చేశారు.

# కళ్ల ముందే 15 మంది మృతి.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న వియత్నాం బోటు ప్రమాద బాధితులు




శంషాబాద్ /ప్రజాదివాస్ జూలై 14
వియత్నాంలో జరిగిన బోటు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కొందరు ఇండియన్ టూరిస్టులు సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. అనంతరం అక్కడే మీడియాతో వారు మాట్లాడారు. "బోటు ప్రయాణం ముగించుకొని, తీరానికి చేరుకునే సమయానికి అంతా బాగానే ఉందనుకున్నాం. కానీ ఒక్కసారిగా వచ్చిన ఒక భారీ అల బోటును బలంగా ఢీకొట్టడంతో సముద్రంలో బోల్తా పడింది. దీంతో సుమారు 20 మందికి పైగా టూరిస్టులు సముద్రంలో పడిపోయారు.బోటు వెనుక భాగంలో కూర్చున్న వారు లోపలే చిక్కుకుపోయి బయటకు రాలేకపోయారు. ముందు భాగంలో ఉన్న మేము ఎలాగోలా ప్రాణాలతో బయటపడగలిగాం. ప్రమాదం జరిగిన పది నిమిషాల్లోనే వియత్నాం రెస్క్యూ టీమ్స్ ఘటనా స్థలానికి చేరుకొని, సహాయక చర్యలు చేపట్టాయి. నీటిలో మునిగి అపస్మారక స్థితికి చేరుకున్న పలువురు టూరిస్టులను తీరానికి తీసుకువచ్చి, సమయానికి సీపీఆర్ అందించడంతో కొంతమంది బతికారు.స్థానిక అధికారులు, సిబ్బంది వేగంగా స్పందించకపోయి ఉంటే ప్రాణనష్టం మరింత ఎక్కువగా ఉండేది'అని వారు తెలిపారు. కళ్ల ముందే తోటి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘోర ప్రమాదంపై వియత్నాం ప్రభుత్వం ఇప్పటికే ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించినట్లు వారు వెల్లడించారు.

# రగుడు రౌండబౌట్ జంక్షన్ వద్ద రోడ్డు భద్రతా చర్యలపై కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారుల పరిశీలన

రాజన్న సిరిసిల్ల జిల్లా/ప్రజాదివాస్ జూలై 14
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రగుడు రౌండబౌట్ చౌరస్తా వద్ద జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా రవాణా శాఖ, రోడ్లు ఒ భవనాల శాఖ (=ఒడీ), మున్సిపల్ శాఖ, ట్రాఫిక్ పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి, డీఈ (ఆర్ఒబీ), =ూా ఎవఎఎవతీ ,మున్సిపల్ కమిషనర్, ట్రాఫిక్ ఎస్ఐ మరియు సంబంధిత అధికారులు జంక్షన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.ప్రమాదాలను తగ్గించేందుకు ఈ క్రింది చర్యలను వెంటనే చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు:రౌండబౌట్‌కు ముందు అన్ని దిశల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడం.స్పష్టంగా కనిపించే విధంగా హెచ్చరిక బోర్డులు, దిశా సూచిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయడం. రాత్రి సమయంలో వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా తగిన వీధి విద్యుత్ దీపాలు (స్ట్రీట్ లైటింగ్) ఏర్పాటు చేయడం.రౌండబౌట్‌ను ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి రిఫ్లెక్టివ్ మార్కింగ్‌లు, క్యాట్ ఐస్ ఏర్పాటు చేయడం.రహదారిపై థర్మోప్లాస్టిక్ రోడ్ మార్కింగ్‌లు, స్టాప్ లైన్లు, జీబ్రా క్రాసింగ్‌లు అవసరమైన చోట వేయడం.జంక్షన్ వద్ద పొదలు, అడ్డంకులను తొలగించి దృశ్యమానత మెరుగుపరచడం.అవసరమైతే స్పీడ్ కాల్మింగ్ చర్యలు చేపట్టి అధిక వేగాన్ని నియంత్రించడం.ట్రాఫిక్ రద్దీ సమయాల్లో పోలీసు శాఖ ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించడం.భారీ వాహనాలు, ఆటోలు మరియు ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అవగాహన కల్పించడం.ఈ సందర్భంగా అధికారులు వాహనదారులకు విజ్ఞప్తి చేస్తూ,





అధిక వేగంతో ప్రయాణించకుండా, ట్రాఫిక్ సూచికలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# పెద్దూర్‌లో సీడబ్ల్యూసీ గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

**– అందుబాటులో ఉన్న భూమి, నిర్మాణ సామర్థ్యంపై అధికారులతో సమీక్ష**



రాజన్న సిరిసిల్ల జిల్లా/ప్రజాదివాస్ జూలై 14
సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) గోదాం నిర్మాణానికి సంబంధించి సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం స్థల పరిశీలన నిర్వహించారు.జిల్లా ఇందిరా మహిళా శక్తి భవనం సమీపంలో ప్రతిపాదిత గోదాం నిర్మాణ స్థలాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సీడబ్ల్యూసీ రీజినల్ మేనేజర్ ఎం. విష్ణువర్ధన్, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా స్థలానికి సంబంధించిన సర్వే నంబర్లు, అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణం, గోదాం నిర్మాణానికి అవసరమైన భూవివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. అలాగే ఎన్ని ఎకరాల్లో గోదాం నిర్మాణం చేపట్టనున్నారో, దాని నిల్వ సామర్థ్యం ఎంత టన్నులు ఉండబోతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు.గోదాం నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అంశాలపై అధికారులతో చర్చించి, అవసరమైన వివరాలను సేకరించారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్, సీడబ్ల్యూసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాయి రూప ట్రస్ట్ ఆదర్శ సేవ

**– లింగంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ**
**– పుస్తకాలు, బ్యాగులు, పెన్నుల అందజేత ట్రస్ట్ సభ్యులకు గ్రామస్థుల ఘన సన్మానం**






చందుర్తి మండలం /ప్రజాదివాస్ జూలై 14
సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు, పెన్నులను పంపిణీ చేసి వారి విద్యాభ్యాసానికి చేయూతనిచ్చింది.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఏద్దండి రాజు, దూలం భూమేష్ గౌడ్, గొంటి నవీన్ విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సాయి రూప ట్రస్ట్ సేవలను కొనియాడిన గ్రామస్థులు ట్రస్ట్ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యా సహాయం గొప్ప పెట్టుబడిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సేవా సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని, సాయి రూప ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గొంటి నవీన్ సేవలను గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం నిర్వహణలో ఆయన అందించిన సహకారం ప్రశంసనీయమని పేర్కొంటూ, ట్రస్ట్ తరఫున కూడా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొక్కుల నరేష్, ఉప సర్పంచ్ ఆకుల ఎల్లయ్య, కేడీసీసీ డైరెక్టర్ కిషన్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్, పబ్బా సురేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు జయశీల, వార్డు సభ్యులు పురుగుల కవిత, లావణ్య, ఉపాధ్యాయురాలు రజిత, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మారుపాక ఆలయాల విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపిన ఆది శ్రీనివాస్

వేములవాడ /ప్రజాదివాస్ జూలై 14
వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గ్రామంలోని దుర్గమ్మ ఆలయం, మార్కండేయ ఆలయంతో పాటు ఎల్లమ్మ ఆలయ నిర్మాణ ప్రాంతానికి విద్యుత్ సౌకర్యం లేక భక్తులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి కేవలం వారం రోజుల్లోనే విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు, స్థానిక జిజిఊూ ఏఈతో పాటు విద్యుత్ శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



# బఫూన్ల రాష్ట్రీయ సమితి = బీఆర్ఎస్ కరప్షన్, కమ్యూనల్ = కాంగ్రెస్

**- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకే నాణేనికి రెండు ముఖాలు**
**- విపత్తులపై ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది**
**- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు ఫైర్**

ప్రజాదివాస్

తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి విధాన పరంగా ఎలాంటి తేడా లేదని, రెండు పార్టీలు ప్రజలను, ముఖ్యంగా రైతాంగాన్ని పూర్తిగా వంచించాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మరియు వాతావరణ నిపుణుల హెచ్చరికలను పెడచెవిన పెట్టడంలో అటు కేసీఆర్, ఇటు రేవంత్ రెడ్డి ఒకే బాటలో పయనిస్తున్నారని విమర్శించారు. గతంలో కరోనా విపత్కర పరిస్థితులపై కేంద్రం ముందుగానే హెచ్చరించినా, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎగతాళి చేస్తూ "పారాసిటమాల్ గోలీ వేసుకుంటే సరిపోతుంది" అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడి ప్రజల ప్రాణాలను గాలికి వదిలేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా దేశంలో, రాష్ట్రంలో 'ఎల్ నినో' ప్రభావంతో కరవు వచ్చే ముప్పు ఉందని వాతావరణ శాఖ మరియు ఇరిగేషన్ నిపుణులు హెచ్చరిస్తుంటే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత బాధ్యతారాహిత్యంగా, "ఎల్ నినో అని చెప్పినోళ్లని బెల్టుతో కొట్టాలనడం ఆయన పరిపాలనా అజ్ఞానానికి పరాకాష్ట అని మండిపడ్డారు. సాధారణంగా మే నెలలోనే వ్యవసాయం, ఇరిగేషన్ రంగాలపై జరగాల్సిన సమీక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ ఆఖరి వరకు పొడిగించిందని, అందులోనూ కేవలం నిధుల విడుదలపైనే దృష్టి పెట్టారు తప్ప రైతులను సన్నద్ధం చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. జూలై రెండో వారం నాటికి రాష్ట్రంలో కేవలం 41.8% మాత్రమే నాట్లు పడ్డాయని, నీరు లేక పొలాలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు వరికి రూ. 500 బోనస్ ఇస్తామని చెబుతూ, మరోవైపు ఆరుతడి పంటలు వేయాలని ముఖ్యమంత్రి పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడం వల్ల మంత్రులు, ఐఏఎస్ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. అధికారుల బదిలీల మీదున్న శ్రద్ధ రేవంత్ రెడ్డికి పాలనపై లేదని, తప్పుడు శాఖలకు ఫైళ్లు పంపి కేంద్రం వద్ద రాష్ట్ర పరువు తీస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తామని, రికవరీ చేస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా ఇప్పటివరకు ఒక్క ఎఫ్ఐఆర్ కూడా ఎందుకు నమోదు చేయలేదని ప్రసాదరావు గారు నిలదీశారు. నిన్నటి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో "తాను వాళ్ళని జైల్లో పెట్టక తప్పు చేశాను" అని సీఎం అనడం వెనుక బీఆర్ఎస్‌తో కుదిరిన లోపాయకారి ఒప్పందమే కారణమని, అవినీతి సొమ్ములో కాంగ్రెస్ కూడా భాగస్వామి అయిందని ఆరోపించారు. తప్పులు చేసినందుకు రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన నాయకులను వదిలేసి, ఇప్పుడు తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీర్లపై నెపం నెట్టడం సమంజసం కాదన్నారు. అటు బిఆర్ఎస్ పార్టీ కూడా ఓడిపోయిన తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకోకుండా 'బఫూన్ల రాష్ట్రీయ సమితి'లా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్, కమ్యూనలిజం అని, ప్రజల ఆస్తులను అమ్మి ఢిల్లీకి కప్పం కట్టడమే ధ్యేయంగా పెట్టుకుందని విమర్శించారు. ఎంఐఎం చేతిలో స్టీరింగ్: గత బిఆర్ఎస్ హయాంలోనే కాకుండా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ భాగ్యనగరంలో ఎంఐఎం పార్టీ రాజ్యమే



నడుస్తోందని, రేవంత్ రెడ్డి 'రేవంతుద్దీన్'లా మారిపోయారని ధ్వజమెత్తారు. ఎంఐఎంకు చెందిన విద్యాసంస్థలు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్నాయని, చెరువులను ఆక్రమించారని స్పష్టమైన ఆధారాలున్నా హైడ్రా లేదా ప్రభుత్వం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. వృద్ధులకు రూ. 4000 పెన్షన్, వికలాంగులకు రూ. 6000 పెన్షన్, మహిళలకు తులం బంగారం మరియు నిరుద్యోగ భృతి వంటి ఆరు గ్యారెంటీల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. కౌలు రైతుల లెక్కలు కూడా తీయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా, తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, బిజెపి ఎంపీలు కేంద్రం నుండి వేల కోట్ల రూపాయల నిధులను తీసుకువస్తున్నారని తెలిపారు. సింగరేణి కార్మికులను ఆదుకోవడానికి బిజెపి నాయకత్వం నిరంతరం శ్రమిస్తోందని చెప్పారు. కేంద్ర నిధుల భాగస్వామ్యం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఒక్క అభివృద్ధి పనినైనా చూపించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఈ రెండు మోసకారి పార్టీలను (కాంగ్రెస్, బిఆర్ఎస్) తిరస్కరించాలని, రాబోయే రోజుల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు నాయకత్వంలో బిజెపిని అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సహకరించాలని కప్పర ప్రసాదరావు గారు పిలుపునిచ్చారు.

# స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**- పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత....కేంద్ర సహాయ మంత్రి సురేష్ గోపి**
**- పరిసరాల పరిశుభ్రతకు స్వచ్ఛమైన గాలి కోసం 'స్వచ్ఛత పక్వాడ' కార్యక్రమం......గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**
**- "మా కే నామ్ ఏక్ పేడ్" కార్యక్రమంలో మొక్కలు నాటిన కేంద్ర సహాయ మంత్రి, ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్**





ప్రజాదివాస్

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 15 రోజుల పాటు నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్వాడ ప్రత్యేక పారిశుధ్య, పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఈ రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ బాలికల మరియు బాలుర పాఠశాలలో తెలంగాణ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమానికి కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మరియు కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి, ప్రముఖ సినీ నటుడు సురేష్ గోపి , చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ , గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'మా కే నామ్ ఏక్ పేడ్' కార్యక్రమంలో భాగంగా అతిథులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సందేశమిచ్చారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, పచ్చదనం తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన "ఏక్ పేడ్ మా కే నామ్" పిలుపు దేశవ్యాప్తంగా పర్యావరణ చైతన్యాన్ని పెంపొందిస్తోందని పేర్కొన్నారు. తల్లి గౌరవార్థం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతికి మన వంతు సేవ చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీపీసీఎల్ (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) రాష్ట్ర హెడ్ (ఎల్‌పీజీ) నిరంజన్ కుమార్ , ఆంధ్రప్రదేశ్ ఱ తెలంగాణ జనరల్ మేనేజర్ (రిటైల్) జగన్నాధ రావు , హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (రిటైల్) షెఫాలీ సింగ్ , ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఱ స్టేట్ హెడ్ పీయూష్ మిట్టల్ , హెచ్‌పీసీఎల్ (హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) జోనల్ హెడ్ సుశీల్ కుమార్ , పాఠశాల ప్రిన్సిపాల్ కల్పన , సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలి.

**- తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కి వినతి**
**- గజ్వేల్ జెయింట్ యాక్షన్ కమిటీ**

ప్రజాదివాస్

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన నిజమైన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని గజ్వేల్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారులు సంఘము టిజెఎసి (తెలంగాణ జాయింట్ ఆక్షన్ కమిటీ) పేర్కొంటు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన ఉమ్మడి మెదక్ జిల్లా ఉద్యమకారుల సమావేశములో కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ కోదండరాం ,రాముల నాయక్ కి వినతి పత్రము ఇవ్వడము జరిగింది. తెలంగాణ ఉద్యమంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు,కవులు కళాకారులు, మహిళలు పాల్గొని రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో కేసులు ఎదుర్కొన్నవారు, జైలు శిక్ష అనుభవించినవారు, తమ విద్యా, ఉద్యోగ అవకాశాలను కోల్పోయినవారు నేడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది ప్రస్తుతం పేదరికంలో జీవిస్తుండగా, ఉద్యమంతో సంబంధం లేని వారు ప్రయోజనాలు పొందారని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో ఉద్యమాన్ని ముందుకు నడిపించిన కార్యకర్తలను గుర్తించి వారికి ప్రత్యేక గుర్తింపు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు కల్పించాలని కోరారు. తెలంగాణ ఉద్యమం కుల, మత, రాజకీయాలకు అతీతంగా సాగిందని, సబ్బండ వర్గాల ప్రజల ఐక్య పోరాట ఫలితంగానే రాష్ట్రం ఏర్పడిందని, ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకుంటు వారి ఆశయాల సాధన కోసం ప్రతి మండల స్థాయిలో ఒక కమిటీ వేయాలి అని మీకు తెలుపా జేస్తున్నాము అదేవిధంగా గుర్తింపు జరిగే విధానము కూడా పారదర్శకంగా జరగాలి. ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఆరోగ్య కార్డులు ఇవ్వాలి. వారిని ఆర్థికంగా నిలబడటానికి ప్రత్యేక సబ్సిడి కేటాయించాలి. ఉద్యమము లో చనిపోయినవారి వారి కుటుంబము లో ఒకరికి ఉద్యోగము ఇవ్వాలి. ఉద్యమ కారుల కు రైతు భరోసా లాగా వారికి ఉద్యమకారులు భరోసా కల్పించాలి. 250 గజాల ప్లాట్ ఇవ్వాలి,వారికి ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వాలి. రాష్ట్ర వ్యాప్తంగా వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలి. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఒక కమిటీ వేయాలి . తెలంగాణ ఉద్యమములో నిరంతరము ఉన్నవారికీ ప్రాధాన్యత ఇవ్వాలి. గతములో ఉద్యమములో పని చేసిన విద్యార్థులకు అక్కడ ఉన్న పోలీస్ వాళ్ళు వాళ్ళ కేసు అయితే వారి జీవితాలు నాశము అవుతాయి అని కేసు చేయలేదు కాబటి వారిని కూడా గుర్తించాలి ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘము జె ఎ సి నాయకులు తుమ్మ శ్రీనివాస్, పొన్నాల కుమార్,చిప్పల యాదగిరి తదితరులు పాల్గొన్నారు



# మునిగడప పాఠశాలలో మొక్కలు నాటిన బిఎంఎస్ గజ్వేల్ ఇంచార్జ్ మరాఠీ కృష్ణమూర్తి

ప్రజాదివాస్



జగదేవపూర్ మండలంలోని మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బి ఎం ఎస్ గజ్వేల్ ఇంచార్జ్ మరాటి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ మామిళ్ల కిషన్, ప్రధాన ఉపాధ్యాయులు కనకయ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు లతో కలసి మొక్కలు నాటారు. పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం లో భాగంగా పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కచ్చితంగా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా బిఎమ్ఎస్ గజ్వేల్ ఇంచార్జ్ మరాఠీ కృష్ణమూర్తి మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పరిశుభ్రం పాటించాలని అన్నారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్రిక్స్ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు మరాఠి కృష్ణమూర్తి

ప్రజాదివాస్






హైదరాబాద్‌లోని లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరిగిన అంతర్జాతీయ బ్రిక్స్ సమ్మిట్ 2026 సమావేశాలలో తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బీఎంఎస్ గజ్వేల్ ఇంచార్జ్ మరాఠి కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సమావేశానికి బీఎంఎస్ జాతీయ అధ్యక్షులు ఎస్. మల్లేశం అధ్యక్షత వహించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాలాల శ్రీనివాస్ తో పాటు తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరాఠి కృష్ణమూర్తి పాల్గొన్నారు. సమావేశానంతరం మరాఠి కృష్ణమూర్తి మాట్లాడుతూ, అంతర్జాతీయ వేదికపై కార్మిక సమస్యలు, ఉద్యోగుల సంక్షేమంపై జరిగిన చర్చలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని తెలిపారు.

# కంబాలపల్లిలో జలయజ్ఞం కార్యక్రమం.. నీటి సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన

ప్రజాదివాస్



సదాశివపేట మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ భారతమ్మ బాబు ఆధ్వర్యంలో జలయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన కల్పించడం, ప్రతి ఒక్కరూ నీటిని ఆదా చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భారతమ్మ బాబు మాట్లాడుతూ, నీరు అమూల్యమైన ప్రకృతి సంపద అని, ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా బాధ్యతగా వినియోగించాలని సూచించారు. నీరు లేకుండా భూమిపై ఏ జీవరాశి కూడా మనుగడ సాగించలేదని, అందువల్ల స్వచ్ఛమైన నీటిని పరిరక్షిస్తూ అవసరానికి తగ్గట్టే వినియోగించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వరూప, వార్డు సభ్యులు కుమ్మరి ఆంజనేయులు, బెలూరి ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ ఆఫ్రీన్ బేగం, మునీర్, వాటర్ టెస్టింగ్ ల్యాబ్ టెక్నీషియన్, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని గ్రామ ప్రజలకు అందించారు.

# ఓటు హక్కును పరిరక్షించుకోవాలి : కె. కనకలక్ష్మి

ప్రజాదివాస్



శేరిలింగంపల్లి డివిజన్, పాపిరెడ్డి కాలనీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం బీఎల్‌ఏలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కాలనీలోని సీనియర్ మహిళా నాయకురాలు కె. కనకలక్ష్మి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కె. కనకలక్ష్మి మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా భాగస్వామి కావాలని కోరారు. బిఎల్‌ఎ లు అందజేసే ఎన్యూమరేషన్ ఫారంలో తమ పూర్తివివరాలను సక్రమంగా నమోదుచేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. బూతు లెవెల్ అధికారులు సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం

**- జిల్లా వైద్య అండ్ ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్**

ప్రజాదివాస్

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య అండ్ ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య అండ్ ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. అనంతరం డా. కె. ఆనంద్ మాట్లాడుతూ.. జిల్లాలో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు,నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫీవర్ సర్వేలు నిర్వహించడం, అనుమానిత కేసులను వెంటనే గుర్తించి చికిత్స అందించడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షయవ్యాధి (టి బి) నియంత్రణ కార్యక్రమంలో టిబి



నోటిఫికేషన్, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) అమలు, రోగుల గుర్తింపు, వారి ఫాలోఅప్‌ను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. మాతా శిశు ఆరోగ్య కార్యక్రమం ఎంసిహెచ్ కిట్ కింద పోర్టల్‌లో సమాచార నమోదును సకాలంలో పూర్తి చేయడంతో పాటు గర్భిణీల నమోదు (ఏఎన్ సి రిజిస్ట్రేషన్) పెంచాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధుల (విపిడి) పర్యవేక్షణను బలోపేతం చేయాలని, అక్యూట్ ఫ్లాసిడ్ ప్యారాలిసిస్ (ఏ ఎఫ్ పి), మీజిల్స్-రుబెల్లా (ఎంఆర్) కేసులను తప్పనిసరిగా నోటిఫై చేయాలని తెలిపారు.(హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని పాఠశాలలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వైద్యాధికారులు తప్పనిసరిగా పాఠశాలల పేరెంట్స్-టీచర్స్ సమావేశాలకు హాజరై వ్యాక్సిన్‌పై ఉన్న అపోహలను నివృత్తి చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే జిల్లాలోని అర్హులైన పిల్లలందరి వివరాలను యూవిన్ (యు-విన్) పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. అసంక్రమ వ్యాధుల (ఎన్ సి డి) నియంత్రణ కార్యక్రమంలో భాగంగా రక్తపోటు (హెచ్ టి ఎన్),మధుమేహం (డి ఎం)కేసుల గుర్తింపును పెంచడంతో పాటు పోర్టల్ నమోదులను పూర్తిస్థాయిలో నిర్వహించాలని తెలిపారు.జిల్లాలోని అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసి రాష్ట్ర స్థాయిలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలపాలని డా.కె.ఆనంద్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కీసర,మల్కాజ్గిరి ఉప జిల్లా వైద్య అండ్ ఆరోగ్య అధికారులు, డా. గీత,డా. లావణ్య రెడ్డి,జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, డా.నాగరాజ్, డా.గీత,డా. చంద్రకళ, డా.పవన్ కుమార్ రెడ్డి,డా.కౌశిక్, జిల్లాలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్యకేంద్రల వైద్యాధికారులు, సంబంధిత రిపోర్టింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పటేల్ చెరువును సుందరవనంగా, శోభితవర్ణం గా తీర్చిదిద్దుతాం.. పి ఎ సి చైర్మన్ గాంధీ..

ప్రజాదివాస్

మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు లో గుర్రపు డెక్క తొలగింపు కోసం దోమల నియంత్రణ కై డ్రోన్ సహాయం తో ఎటువంటి హానికరం కానీ కలుపు మందును పిచికారీ చేయించిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పాల్గొన్న పి ఎ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ .ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పటేల్ చెరువు సుందరీకరణ , అభివృద్ధి పనులలో భాగంగా గుర్రపు డెక్క తొలగింపు కొరకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు హానికరం కలగకుండా ఉండేందుకు వీలుగా కలుపు మందు ను డ్రోన్ సహాయం తో పిచికారి చేయడం జరుగుతుంది అని, దీని వలన పూర్తి స్థాయిలో గుర్రపు డెక్క తొలగించడం జరుగుతుంది అని, దీని ద్వారా దోమల నియంత్రణ జరుగును అని పి ఎ సి చైర్మన్ గాంధీ అన్నారు.పటేల్ చెరువును సుందరవనంగా, శోభితవర్ణం గా తీర్చిదిద్దుతామని అదేవిదంగా చెరువ చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చెరువు ను సంరక్షిస్తామని గాంధీ తెలియచేసారు .చెరువు అపరిశుభ్రం వలన పేరుకుపోయిన గుర్రపు డెక్క వలన దోమల పెరగడం వలన స్థానికులకు ఏర్పడుతున్న ఇబ్బందులను ,అనారోగ్యాలకు గురవడం స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యే కి పిర్యాదు చేయడం వలన దీనికి స్పందించిన చైర్మన్ గాంధీ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క ను తొలగించి, చెరువును శుభ్రపరిచి సుందరీకరణ చేసిన సంగతి విదితమే అదేవిధంగా ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని చెప్పడం జరిగినది , తామర పువ్వులను పెంచి కలుషితం కాకుండా చెరువును సుందరీకరిస్తామని పి ఎ సి చైర్మన్ గాంధీ చెప్పటం జరిగినది .చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ,చెరువులు కలుషితం కాకుండా మరియు కబ్జాలకు గురికాకుండా చెరువులను పూర్తి స్థాయి లోసంరక్షిస్తామని , చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేసి ,ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన



వాతావరణాన్ని అందిస్తామని,అలాగే నియోజకవర్గం లోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామని గాంధీ చెప్పటం జరిగినది చెరువుల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని ఆయన తెలియచేసారు ఈ కార్యక్రమంలోనాయకులు , కాలనీ వాసులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం పరిశుభ్రంగా, రుచికరంగా ఉండాలి

**- వారానికి మూడు గుడ్లు, మూడుసార్లు రాగి జావ అందించాలని ఆదేశం**

**- పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవు: ఎంఈఓ శంకర్**

ప్రజాదివాస్

సదాశివపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో పరిశుభ్రత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సదాశివపేట మండల విద్యాధికారి ఎన్. శంకర్ వంట ఏజెన్సీ కార్మికులకు సూచించారు.మంగళవారం మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన



మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వంట చేసే సమయంలో గ్లౌజులు, యాప్రాన్, మాస్క్, చెఫ్ క్యాప్ తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. వంటశాల, పరిసరాలను ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నిల్వ సరుకులు, కూరగాయలు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రతలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.విద్యార్థులకు వారానికి మూడు గుడ్లు, వారానికి మూడుసార్లు రాగి జావ అందించాలని తెలిపారు.వంట ఏజెన్సీ ట్రైనర్ సునీత సభ్యులకు ఆహార తయారీ విధానాలు, వ్యక్తిగత పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై అవగాహన కల్పించారు. భోజన నాణ్యతలో ఎలాంటి లోటు ఉండకూడదని సూచించారు.ప్రభుత్వ లక్ష్యమైన విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో అందరూ బాధ్యతతో పనిచేయాలని ఎంఈఓ శంకర్ కోరారు. సమావేశంలో మండలంలోని పలు పాఠశాలల వంట ఏజెన్సీ కార్మికులు పాల్గొన్నారు.

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో అధ్యక్షురాలిగా లక్ష్మి

**- గజ్వేల్ ప్రజ్ఞాపూర్ టి జి ఎస్ ఆర్ టి సి డిపో కార్మిక్ సంఘ్ (బి ఎం ఎస్) నూతన కమిటీ ఎన్నిక**

ప్రజాదివాస్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో లో నేడు ఆర్టీసీ కార్మిక్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కారదర్శి ఎర్ర స్వామి కృష్ణమూర్తి, గజ్వేల్ బి ఎం ఎస్ ఇంచార్జ్ మరాఠీ కృష్ణమూర్తి,సిద్దిపేట జిల్లా బి ఎం ఎస్ అధ్యక్షులు తిరుపతి గౌడ్,రాజయ్య అధ్యక్షతన డిపో నూతన యూనియన్ ను ఏర్పాటు చేయడం జరిగింది. డిపో అధ్యక్షురాలిగా మహిళ నాయకురాలు లక్ష్మీ ని డిపో సెక్రటరీ గా సాయి కిషోర్,కోశాధికారిగా ఎం శ్రీనివాస్ ని ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా నూతన కమిటీ డిపో మేనేజర్ ని కలిసి నూతన కమిటీ పరిచయ వేదిక ఏర్పాటు చేశారు డిపో నూతన అధ్యక్షురాలు లక్ష్మీ అలాగే డిపో సెక్రటరీ సాయి కిషోర్ మాట్లాడుతూ డిపో లో ఎలాంటి సమస్యలు ఉన్న కార్మికులకు నష్టం కలిగించే ఎలాంటి పరిస్థితులు ఉన్న కార్మికుల పక్షాన పోరాడతామని నిరంతరం కార్మికులకు అందుబాటులో



ఉంటూ కార్మికుల కష్టాల్లో పాలు పంచుకుంటామని కార్మికులతో కలిసి పనిచేస్తూ జిల్లాలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ను ఉత్తమ శ్రేణిలో నిలబెడతామని భవిష్యత్తులో బి ఎం ఎస్ కార్మిక్ సంఘ్ ను ఉన్నత స్థాయిలో నిలబెడతామని తెలియజేశారు. ఈ సదర్భంగా డిపో వైస్ ప్రెసిడెంట్ గా బాబు గౌడ్ జాయింట్ సెక్రటరీ గా సయ్యద్ పయజుద్దీన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గా వంశీకృష్ణ, అడ్వైజరీ కమిటీ సభ్యులు గా శ్యామల,గీతాదేవి, రామదాసు,శ్రీనివాస్,సుకన్య, సాయి కిరణ్,ఖాజా పాషా సభ్యులుగా వినయ్,సతీష్,రాజు, నవీద్ ,ఇసాక్,స్రవంతి,కృష్ణవేణి,సంగీత,చంద్రశేఖర్,రాజశేఖం ఎన్నుకోవడం జరిగింది.

# రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పెద్దపల్లి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్,

**- ఇంటి సోదాల్లో రూ.32.31 లక్షల అక్రమ నగదు స్వాధీనం..**



ప్రజాదివాస్

పెద్దపల్లి మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజనీర్ కల్లేపల్లి సతీష్ కుమార్‌ను కాంట్రాక్టర్ బిల్లు ప్రాసెస్ చేసి టీయూఎఫ్ఐడీసీకి పంపేందుకు రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా రెడ్ హ్యాండెడ్ కరీంనగర్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచం నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇంటి సోదాల్లో రూ.32.31 లక్షల లెక్కల్లో చూపని నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా కేసు దర్యాప్తులో ఉందనీ తెలిపారు.

# ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో బిఎల్ ఓ లదే ముఖ్యపాత్ర

**- మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



ప్రజాదివాస్

ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా పూరించిన ఫారాలను తీసుకోవడం, డిజిటలైజ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవగాహన కల్పించడం బిఎల్ఓ ల బాధ్యతని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు.

మంగళ వారం ఉప్పల్ లోని 375, 376 పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు చేసిన ఎన్యూమేరషన్స్ సెంటర్లలో నిర్వహిస్తున్న సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియను అదనపు కలెక్టర్ పర్యవేక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫారాల ప్రక్రియను వేగవంతం చేయాలని, స్వీకరించిన ఫారాలను వెంటవెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత బిఎల్ వో లదేనని స్పష్టం చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో బి ఎల్ వో లు ఓటర్లకు సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ ఏఈఆర్వోలు, బి ఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

# కుషీ గార్డెన్ భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం

**- రూ.11.70 లక్షల వ్యయంతో డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులకు మోక్షం**

**- దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు**



ప్రజాదివాస్

కీసర సర్కిల్ పరిధి దమ్మాయిగూడ డివిజన్ 7వ వార్డు లోని కుషీ గార్డెన్‌లో మంగళవారం (యుజి డి) భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు హాజరై అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుషీ గార్డెన్ నివాసితులకు మెరుగైన భూగర్భ డ్రైనేజీ మౌలిక సదుపాయాలు, పారిశుధ్య సౌకర్యాలను కల్పించే లక్ష్యంతో సుమారు రూ.11.70 లక్షల వ్యయంతో 260 మీటర్ల పొడవు,1 అడుగు వెడల్పు గల డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పా రామారావు, మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జూపల్లి శోభారాణి, కార్తీక్ గౌడ్, నర్సింహ రెడ్డి, సుమేష్, గోవింద్ సింగ్, దిలీప్ కుమార్, సమ్మి రెడ్డి, ప్రసాద్ గౌడ్, శ్రవణ్ రెడ్డి, రాజేష్, పండాల యాదగిరి గౌడ్, కుందన్‌పల్లి వెంకటేష్, ముప్పా శ్రీలత, మనోజ్ రెడ్డి, భాస్కర్ గౌడ్, ప్రశాంత్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీతో సిద్దిపేట జిల్లా టి జె సి ఉద్యమకారుల సమావేశం



ప్రజాదివాస్
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారకం అమరజ్యోతి వద్ద ఉమ్మడి సిద్ధిపేట జిల్లా ఉద్యమకారులతో సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి ఆధ్వర్యంలో సిద్ధిపేట జిల్లా టి జె సి ఉద్యమకారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో టి జె ఎ సి పోషించిన పాత్ర, ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం, సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఉద్యమంలోని వివిధ దశల్లో పాల్గొన్న ఉద్యమకారుల గుర్తింపునకు సంబంధించి వివరాలను, సూచనలను కమిటీ సభ్యులు కమిటీతో పంచుకున్నారు. ఉద్యమంలో భాగస్వాములైన అన్ని వర్గాలతో దశలవారీగా సంప్రదింపులు నిర్వహించి, వారి సూచనలు, సలహాలను స్వీకరించిన అనంతరం సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఉద్యమకారులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ కే. కేశవరావు, శాసనమండలి సభ్యులు ప్రొ. కోదండరాం, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణ జన సమితి పార్టీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి, యువజన విభాగ అధ్యక్షుడు కీసర స్వామి ప్రవీణ్ తో పాటు వివిధ స్థాయి నాయకులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొండాపూర్ మండలంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన బీజేపీ మండల అధ్యక్షుడు పెట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి

ప్రజాదివాస్
కొండాపూర్ మండలంలోని తొగర్‌పల్లి, కొండాపూర్, దొబ్బకుంట గ్రామాల పోలింగ్ బూత్‌లలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని బీజేపీ కొండాపూర్ మండల అధ్యక్షుడు పెట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయిలో



జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను సరిచూసుకుని, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అమ్రాది ఎల్లయ్య, శివ, యాదవ్, శ్రీను, వాసు, యాదగిరి, శంకర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన కుంగ్ ఫూ గ్రాండ్ మాస్టర్ పోచయ్యను అభినందించిన జగ్గారెడ్డి



ప్రజాదివాస్
గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన సంగారెడ్డి జిల్లాకు చెందిన కుంగ్ ఫూ గ్రాండ్ మాస్టర్ పోచయ్యను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన కుంగ్ ఫూ కటా ప్రదర్శనలో 1,212 మంది సభ్యులతో కూడిన బృందం కేవలం అరగంటలో 72 సార్లు కటా ప్రదర్శించి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పింది. ఈ రికార్డును మూడు రోజుల క్రితం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ అధికారికంగా ధృవీకరించి లండన్ నుంచి సర్టిఫికెట్లను పంపించింది. ఈ ఘనతలో సంగారెడ్డి జిల్లాకు చెందిన కుంగ్ ఫూ గ్రాండ్ మాస్టర్ పోచయ్యతో పాటు ఆయన శిష్య బృందం కీలక పాత్ర పోషించింది. కుంగ్ ఫూ క్రీడలో ఉమ్మడి మెదక్ జిల్లాకు ఇది తొలి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కావడం విశేషం. గతంలో ఉన్న ప్రపంచ రికార్డును అధిగమిస్తూ ఈ బృందం కొత్త చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా పోచయ్య జగ్గారెడ్డిని కలిసి రికార్డు విశేషాలను వివరించగా, జగ్గారెడ్డి శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు గోపాల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం.

- అధికారులతో సమీక్షించి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం.
- జనగామలో 39 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ.
- ముఖ్య అతిథిగా హాజరైన జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి.



ప్రజాదివాస్
జనగామ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జనగామ పట్టణం, మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి పథకం లబ్ధిదా రులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 39 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేసి వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. కళ్యాణలక్ష్మి చెక్కులు కొంతకాలంగా పెండింగ్‌లో ఉండటాన్ని గుర్తించి, వాటిని త్వరితగతిన లబ్ధిదారులకు అందించేందుకు తాను ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. ఎంఆర్ఓ, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయ అధికారులతో పలుమార్లు చర్చించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి నట్లు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు ఆలస్యం కాకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి నట్లు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే తాను పాల్గొనే ప్రతి కార్యక్రమంలోనే కళ్యా ణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో చేరేలా చూడటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. ఈ పథకం వల్ల పేద కుటుంబాలపై వివాహ ఖర్చుల భారం తగ్గడంతో పాటు వారికి ఆర్థిక భరోసా కలుగుతోందని తెలిపారు.

# పచ్చని చెట్ల నరికి వేత.

- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ఫారెస్ట్ అధికారులు..?





ప్రజాదివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఇష్టానుసారంగా కొందరు చెట్లను నరికి వేయడం జరుగుతుంది.

వర్షం కురవడానికి ప్రధానాధారమైన అటవి సంపద కలప వ్యాపారుల దాహానికి రోజురోజుకు కనుమరుగు అవుతోంది. ఎక్కడ పచ్చని చెట్లు కనిపించినా అక్కడ గబ్బిలంలా వాలి పోయి సంబంధిత రైతులకు ఎంతో కొంత ముట్ట జెప్పి పెద్ద పెద్ద చెట్లను సైతం నరికి కట్టెల మిషన్లకు తరలించి అక్కడి నుండి గంభీరావుపేట మండలం నుంచి ఇతర మండలాలకు తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతి పత్రంలు లేకుండా 5 నుంచి 6 లోడ్లు పంపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే కట్టెల మిషన్లు జనవాసాల మధ్యలో ఉండటంతో విపరీతమైన శబ్దంతో పాటు పొట్టు కూడా సమీపంలోని ఇంట్లోకి రావడంతో పెద్దవారితో పాటు చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని ఇదే విషయమై గతంలో ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అంటున్నారు. పర్యావరణ సమతుల్యత, జీవవైవిధ్యం దెబ్బతింటుంది. వాల్టా చట్టం ప్రకారం.. అడవులతో పాటు రైతు పంట పొలాల్లో కూడా చట్టవిరుద్ధంగా చెట్లను నరకకూడదు. కేవలం అటవీశాఖ అనుమతితో అడవి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఎండిపోయిన, బలహీనమైన, తెగుళ్లు సోకిన లేదా అగ్నిప్రమాదాలకు కారణమయ్యే చిన్న చెట్లను మాత్రమే నరకాలి. పర్యావరణ సమతుల్యత కోసం పెద్ద చెట్లను, ఆరోగ్యకరమైన చెట్లను సజీవంగా ఉన్న, అరుదైన మరియు పర్యావరణానికి మేలు చేసే వృక్షాలను నరకడం పూర్తిగా నిషేధం. ఇదే విషయం గత సంవత్సరం దిశ పత్రికలో కథనం వచ్చిన కూడా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కలప వ్యాపారులు మాత్రం ఎప్పటిలాగే అనుమతులు లేకుండానే విలువైన నెమలి, వేప,మామిడి వంటి విలువైన చెట్లను కూడా చెట్లను నరికి వేస్తుండటంతో జీవవైవిధ్యం దెబ్బ తినడంతో పాటు వన్యప్రాణులు తమ కోల్పోవడంతో జనావాసాల్లోకి వస్తున్నాయి.

# చంద్రంపేట గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్



ప్రజాదివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చంద్రంపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ౘ ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నివాస ప్రాంతాలు, నీటి నిల్వలు, కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, దోమలు వృద్ధి చెందే అవకాశమున్న ప్రదేశాలను పరిశీలించి, దోమల నివారణ చర్యలు సక్రమంగా అమలు చేయాలని సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బంది కి సూచనలు చేశారు. గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం, శుక్రవారం వారానికి రెండు రోజులు తప్పనిసరిగా డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి పాత్రలను శుభ్రపరచి మూతపెట్టాలని, కూలర్లలోని నీటిని తరచూ మార్చాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించడానికి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు లేదా ఇతర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య సేవలు పొందాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతోనే దోమల నివారణ చర్యలు విజయవంతమవుతాయని డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎమ్ ఎల్ హెచ్ పి డాక్టర్ స్రవంతి మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రాజన్న సిరిసిల్ల

## కరీంనగర్‌లో శరవేగంగా “శంకర్ కామెడీ” షూటింగ్.. నవ్వుల సందడి



ప్రజాదివాస్
కరీంనగర్ జిల్లా పరిసర ప్రాంతాల్లో మంగళవారం ప్రముఖ వినోదాత్మక ప్రాజెక్ట్ “శంకర్ కామెడీ” షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే వినోదభరిత సన్నివేశాలను చిత్ర యూనిట్ ఉత్సాహంగా చిత్రీకరిస్తోంది. ఈ షూటింగ్‌లో యూట్యూబ్ స్టార్ సుమన్ గౌడ్, పీపుల్ స్టార్ ఎర్రన్న, స్టైలిష్ స్టార్ రవళి, కమెడియన్ ఆరెల్లి రవీందర్ గౌడ్, లావణ్య ప్రధాన పాత్రల్లో నటిస్తూ తమ సహజ నటనతో ఆకట్టుకుంటున్నారు. చిత్రానికి దర్శకుడు మద్దివేని శంకర్ వినోదానికి పెద్దపీట వేస్తూ ప్రతి సన్నివేశాన్ని ప్రేక్షకులకు చేరువయ్యేలా తెరకెక్కిస్తుండగా, డీఓపీ రజాక్ తన కెమెరా పనితనంతో ప్రతి ఫ్రేమ్‌ను అద్భుతంగా చిత్రీకరిస్తున్నారు. షూటింగ్ సందర్భంగా చిత్రీకరించిన వర్కింగ్ స్టిల్స్ ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. త్వరలో యూట్యూబ్‌లో విడుదల కానున్న ఈ కామెడీ వీడియో ప్రేక్షకులకు వినోద విందు అందిస్తుందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేసింది.

## విజయ్ కోసం వెనక్కి తగ్గిన కుమారుడు..

# 'జన నాయగన్'కు లైన్ క్లియర్



విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం.సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది.


**నటుడిగా సంజయ్..**

ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.


## 'రావు బహదూర్'.. అరుదైన చిత్రం:

# సందీప్ రెడ్డి వంగా

ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే విడుదలైన 'రావ్ బహదూర్' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకున్నారు. సినిమాను గొప్పగా తీసిన చిత్ర బృందాన్ని అభినందించారు."మనం సినిమాను ఎందుకు అంతగా ప్రేమిస్తామో మరోసారి గుర్తుచేసే అరుదైన చిత్రాల్లో 'రావు బహదూర్' ఒకటి. సినిమా ప్రేమికుడికి నాదొక చిన్న విన్నపం.. మీ జీవితంలోని మూడు గంటల సమయాన్ని 'రావ్ బహదూర్'కు ఇవ్వండి. కచ్చితంగా మీకు నచ్చుతుంది. అన్ని ప్రశంసలు అందుకునేందుకు దీనికి పూర్తి అర్హత ఉంది. వెంకటేశ్ మహా తక్కువ బడ్జెట్‌లో అద్భుతంగా రూపొందించారు. ఎంతో ధైర్యం, తనపై తనకు బలమైన నమ్మకం ఉన్న వాళ్లు మాత్రమే ఇలా తెరకెక్కించగలరు. ఇక సత్యదేవ్ తన నటనతో అదరగొట్టారు. ఇందులో ఎలాంటి అనవసరమైన హడావుడి లేదు, షార్ట్‌కట్‌లు లేవు. కేవలం స్వచ్ఛమైన కథ మాత్రమే కనిపిస్తుంది" అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇలాంటి సినిమాలను కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలని అన్నారు.వెంకటేశ్ మహా దర్శకత్వంలో సత్యదేవ్ హీరోగా తెరకెక్కిన 'రావు బహదూర్' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. దీనిపై ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. ఇలాంటి తెలుగు సినిమా తాను ఇంతకుముందు చూడలేదని మహేశ్ బాబు దీన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఇక ఇందులో సత్యదేవ్ నటన చూస్తే తనకు ఆసూయ కలిగిందని నాగచైతన్య అన్నారు.



## ఆ సంస్థతో ఎన్టీఆర్‌కు ఎలాంటి సంబంధం లేదు: స్పష్టం చేసిన టీమ్




ఎన్టీఆర్ పేరుతో ప్రకటనలు చేస్తూ, కార్యక్రమాలు నిర్వహిస్తోన్న RAW NTR సంస్థకు ఎలాంటి అధికారం లేదని నటుడు ఎన్టీఆర్ కార్యాలయం స్పష్టం చేసింది. ఆయనకు సంబంధించిన సేవా, ప్రజా సంక్షేమ కార్యక్రమాల వివరాలు కేవలం వ్యక్తిగత లేదా ఆయన అధికారిక బృందం ద్వారా మాత్రమే వెల్లడి అవుతాయని ప్రకటించింది.ప్రస్తుతం తారక్ 'డ్రాగన్' మూవీతో బిజీగా ఉన్నారు. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. వచ్చే ఏడాది జూన్ 11న (ntr dragon movie release date) ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించనున్నారు. (ntr trivikram movie) కార్తికేయుని కథాంశంతో భారీ బడ్జెట్‌తో దీనిని రూపొందించనున్నారు. 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది.

## ఆ క్రెడిట్ నాకు దక్కాలి: తాప్సీ

గత కొన్ని సంవత్సరాలుగా హిందీ సినిమాల్లో తనదైన స్టైల్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు నటి తాప్సీ. పింక్, థప్పడ్, సాండ్ కి ఆంఖ్, బద్లా, హసీనా దిల్‌రుబ, ముల్క్ లాంటి సినిమాలతో మంచి విజయం సాధించారు. ఇటీవల ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అందరూ భయపడే విషయాలల్లో తాను రిస్క్ తీసుకున్నారని వెల్లడించారు.'ఇది కమర్షియల్‌గా ఆడదు' అని అందరూ అనుకునే సినిమాల్లో నేను ధైర్యంగా నటించాను. నాకు నేను ఇచ్చుకునే క్రెడిట్ ఇదే. ప్రతి సినిమా రూ.100 కోట్లు వసూలు చేయాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఇది మంచి సినిమా అవుతుంది. ప్రేక్షకులు తప్పకుండా ఇష్టపడతారు అనే నమ్మకంతో కథల్ని ఎంపిక చేసుకుంటాను. అందుకే ఆ క్రెడిట్ నాకు దక్కాలి. ఒక సినిమా సక్సెస్ కావాలంటే హీరోనే కాదు.. దర్శకుడు, నిర్మాత, రైటర్, టీమ్, ప్రేక్షకులు అందరూ కారణమే. నటిగా కొత్త కథలను నమ్మి ముందుకు అడుగు వేయాలని భావిస్తాను." అని తాప్సీ చెప్పారు. కొంతకాలంగా తాప్సీ సోషల్ మీడియాకు దూరంగా ఉన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా తన అభిమానుల్ని 'మీరు నా దగ్గర నుంచి ఎలాంటి కంటెంట్ కోరుకుంటున్నారు?' అని అడిగారు. దీంతో మళ్లీ ఆమె సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారని తెలుస్తోంది.



## సినిమాలకు భాషతో సంబంధం లేదు: అడివి శేష్



సినిమాలకు భాషతో సంబంధం లేదని నటుడు అడివి శేష్ అన్నారు. కథ బాగుంటే ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారని చెప్పారు."ఒకే భాషకు పరిమితమయ్యేలా సినిమాలు ఉండకూడదు. ఇప్పుడున్న ప్రేక్షకులు భాష రాకపోయినా కథ నచ్చితే.. ఇతర సినిమాలనూ ఆదరిస్తున్నారు. ఇప్పటికీ మనం సినిమాలను 'హిందీ సినిమా', 'తెలుగు సినిమా', 'తమిళ్ సినిమా' అనే పిలుస్తున్నాం. 'పాన్-ఇండియా మూవీ' అనే పదాన్ని మాత్రం విడిగా వాడుతున్నాం. కథలను భాషా హద్దులతో కాకుండా ఇండియన్ స్టోరీస్‌గా స్వీకరించినప్పుడే అది పాన్-ఇండియా సినిమా అవుతుంది. ప్రేక్షకుల ఆలోచనా విధానాన్ని సినీ పరిశ్రమ అర్థం చేసుకోవాలి. ప్రేక్షకుల కోసం మంచి సినిమాలు తీయడం మా బాధ్యత. ఒక్క భాషకే పరిమితం కాకుండా దేశమంతా చూసే సినిమాలు చెయ్యాలి" అని అడివి శేష్ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. ఇక, ఆయన తదుపరి చిత్రం వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో వస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'గూఢచారి 2' లో కనిపించనున్నారు.

# నాని 'ది ప్యారడైజ్' మళ్లీ వాయిదా




ఈ ఏడాది సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'ది ప్యారడైజ్' ఒకటి. హీరో నాని నటించిన ఈ సినిమా విడుదల తేదీ మళ్లీ వాయిదా పడినట్లు సమాచారం. షూటింగ్ పూర్తి కాకపోవడం, ప్రచారానికి తగిన సమయం లేకపోవడం కారణంగా, చిత్రబృందం రిలీజ్‌ను సెప్టెంబర్ 24కు వాయిదా వేసినట్లు తెలుస్తోంది. విజయవంతమైన 'దసరా' తర్వాత కథానాయకుడు నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రానున్న సినిమా ఇది. ఇందులో నాని 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' మంచి టాక్‌ను సంపాదించుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. నానితో పాటు ఈ మూవీలో మోహన్‌బాబు, తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయికగా మెరవనున్నారు.